క్లుప్తంగా

నేటి నుంచి ఆర్యవైశ్య సంఘం నామినేషన్లు

నేలకొండపల్లి: ఆర్యవైశ్య సంఘం మండల కమిటీని ఈనెల 24న ఎన్నుకోనున్నారు. మండలంలో 1,100 మందికి ఓటు హక్కు కలిగి ఉండగా, బుధవారం నామినేషన్లు స్వీకరిస్తారు. కాగా, మండల అధ్యక్ష పదవిని ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగా చేసేందుకు సంఘం పెద్దలు కసరత్తు ప్రారంభించారు. నేలకొండపల్లికి చెందిన వ్యాపారి దోసపాటి చంద్రశేఖర్‌ను ఎన్నుకోవాలనే భావనతో ఉన్నట్లు తెలిసింది.

22న సర్వసభ్య సమావేశం

ఖమ్మం సహకారనగర్: ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22వ తేదీన ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేదరమెట్ల స్వరూపరాణి, కానూరు హిమబిందులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

కార్మికుల హెచ్‌ఆర్‌ఏపై పునరాలోచన చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల హెచ్‌ఆర్‌ఏపై పునరాలోచన చేయాలని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, రమేశ్‌లు ఆరోపించారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జీఓ 53 ప్రకారం హెచ్‌ఆర్‌ఏను సవరించినట్లు ప్రభుత్వం చెబుతుంది కానీ 53 జీఓ ప్రతిపాదన నాడు ఫిట్‌మెంట్ వ్యవహారం చర్చకు రాలేదన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం డిపో కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కార్పొరేటర్ రాజీనామా

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు లేఖ రాశారు. అనారోగ్యం కారణాలతో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనలేకపోతున్నాని, ఇంత కాలం పార్టీలో మీరంతా తనను ప్రేమతో ఆదరించారని లేఖలో పేర్కొన్నారు. ఈమేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి తన రాజీనామా లేఖను ఆమోదించాలని కోరారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఏప్రిల్ 8న జరిగే మాదిగ, మాదిగ ఉపకులాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజ్యసభసీట్లు మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, నాగమణి, ఉపేందర్, కె.నర్సింహ, మాతంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	గామీ
సాయిరాం	తంత్ర, పరతులు వర్తిస్తాయి!
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	30	చుక్కకూర	3
బీర	40		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	36		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	60		20

\-ఖమ్మం వ్యవసాయం

గూడు.. గోడు!



ముచ్చర్లలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం

'డబుల్' ఇళ్ల కోసం ఎదురుచూపులు

- మండలంలో 40 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- నేటికీ ప్రారంభానికి నోచుకుని వైనం
- ఆరేళ్లుగా పంపిణీలో జాప్యం
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలన్నీ..



ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. సుమారు ఆరేళ్ల క్రితం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సదరు కాంట్రాక్టర్లు ఏళ్లు గడుస్తున్నా.. సకాలంలో పూర్తి చేయలేకపోయారు. కనీసం పూర్తయిన ఇళ్లను అయినా పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వీటిని గూడులేని పేదలకు పంపిణీ చేస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో 20, పింజరమడుగు గ్రామంలో 20 ఇళ్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే సదరు కాంట్రాక్టర్లు పనులు చేపట్టిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్మాణ పనులు నత్తనడక సాగించారు. ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరేళ్లయినా నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. కాగా, కొద్ది నెలల క్రితం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ పేదలకు ఇళ్ల కేటాయింపులో జ్యాపం జరుగుతుంది.

పంపిణీలో జాప్యం..

ముచ్చర్లలో 20, పింజరమడుగులో 20 ఇళ్ల నిర్మాణం పూర్తయినవి. అయితే ముచ్చర్ల గ్రామంలో ఇళ్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా.. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి గ్రామ సభ ద్వారా అర్హుల జాబితాను ప్రకటించారు. కాగా, ఈ జాబితాలో కొంతమంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో మళ్లీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను గుర్తిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. కానీ నేటి వరకు విచారణ చేపట్టలేదు. దీంతో గ్రామంలో గూడులేని నిరుపేదలకు ఇళ్ల పంపిణీ కలగానే మిగిలిపోయింది. అంతే కాక పింజరమడుగులో డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ అసలు కనీసం దరఖాస్తులను కూడా స్వీకరించలేదు. ఈ తంతు అంతా జరగాలంటే మరో కొన్ని నెలలు వేచి చూడాల్సిందేమరి. కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పేదలకు ఇళ్లు అందుతాయని ఎదురుచూస్తున్నారు.

అరకొరగా సౌకర్యాలు..

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా నత్తనడకన సాగాయి. ఏళ్లు గడిచిన తర్వాత నిర్మాణ పనులు పూర్తయినా.. ఇళ్ల సముదాయంలో కనీస మౌలిక వసతులు కల్పించడం మరిచారు. ముచ్చర్లలో కేవలం విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేశారే తప్ప ప్రధాన సమస్య అయిన రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించలేదు. అలాగే పింజరమడుగులో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యాలను కల్పించారు కానీ విద్యుత్, సీసీ రోడ్ల సౌకర్యం కల్పించలేదు. దీంతో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తే సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడక తప్పదు.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం..



ముచ్చర్ల శివారులో నిర్మించిన డబుల్ ఇళ్లు ఐదేళ్లు గడిచినా పూర్తికాలేదు. గత కొన్ని నెలల కితం పూర్తయినా కనీసం తాగు నీరు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించలేదు. ఇకనైనా అన్ని సౌకర్యాలతో ఇళ్లు పంపిణీ చేయాలి. ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.

\- సంగం సాయి, ముచ్చర్ల

పాలకులు స్పందించాలి..



ఇళ్ల నిర్మాణానికే ఐదేళ్లకు పైగా సమయం పట్టింది. నిర్మాణం పూర్తయినా అధికారులు అర్హులను గుర్తించి ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలి.

\- కిన్నెర సురేశ్, పింజరమడుగు

20 కుటుంబాలకు అవకాశం..



మా గ్రామంలో 20 డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తయినవి. ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తే 20 కుటుంబాల వారికి లబ్ధి చేకూరుతుంది. ఇకనైనా పూర్తయిన ఇళ్లను త్వరగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- పాశం శివకృష్ణ, పింజరమడుగు

త్వరలోనే పంపిణీ చేస్తాం..



ముచ్చర్ల, పింజరమడుగు గ్రామంలో 40 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తఅయినవి. గ్రామస్తుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా గ్రామాల్లో పారదర్శకంగా గ్రామసభలు ద్వారా అర్హులను గుర్తిస్తాం. త్వరలోనే ఇళ్ల పంపిణీ చేపడతాం.

\- సుధాకర్, తహసీల్దార్

మధ్యాహ్న భోజనం కోసం ఇక్కట్లు



విద్యార్థినులతో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలాయపాలెం: పదోరగతి పరీక్షల నేపథ్యాన మధ్యాహ్న భోజన తయారీని ఆపేయడంతో విద్యార్థులు భోజనం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరీక్ష కేంద్రంలోని వంట వర్కర్లను సీఎస్ అనుమతించకపోవడంతో మధ్యాహ్న భోజనం తయారు చేయకపోవడంతో విద్యార్థులు ఆకలితో మంగళవారం అలమటించారు. ఈనేపథ్యాన విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు కొమ్ము శ్రీను, వల్లపు కోటయ్య, సాయిలు విద్యార్థులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రం ఆవరణలో వర్కర్లను మధ్యాహ్నం భోజనం తయారు చేయకుండా పరీక్ష కేంద్రం నిర్వాహకురాలు అడ్డుకోవడంతో సాయంత్రం 3 గంటల వరకు విద్యార్థులు ఆకలితో అలమటించాల్సి వచ్చిందని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లగా.. కమిషనర్ ఆదేశాల మేరకు వేరే స్కూల్ దగ్గర వండించి తీసుకురావాలని చెప్పినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మను వివరణ కోరగా.. మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులు ఇబ్బంది పడ్డ విషయం తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి పొరపాట్లు జరగకుండా తగు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుమలాయపాలెం: వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయాలను సాధించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలాయపాలెంలో మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ .. తెలంగాణ సాయుధపోరాట స్ఫూర్తిని తీసుకొని కార్యకర్తలు ఉద్యమంలో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నెర్సుల వెంకటేశ్, కొమ్ము పెరమయ్య, స్వామి, వెంకన్న, రాములు, ముత్తయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తాయిలాలు తరలించొద్దు..

నేలకొండపల్లి: వాహనాలలో నగదు, ఆభరణాలు ఇతరత్రా వస్తువులు, ఎన్నికల తాయిలాలు తరలిస్తే ఊరుకునేది లేదని, అలాంటి సమాచారం తమకు అందించాలని పాలేరు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జి.వేణుమనోహర్ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సజావుగా సాగేందుకు ఏ ఒక్క వాహనాన్ని వదిలేదు లేదని, ఎంతటి వారైనా సరే తనిఖీ చేయాల్సిందేనన్నారు. తనిఖీలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారి సురేందర్‌రెడ్డి, నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు, ఏఎస్సై కోడేత్రాచు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండితాపురం జాతర ఉత్సవాలు ప్రారంభం



స్వామివారిని ఆలయానికి తీసుకొస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: రామలింగేశ్వరా.. శరణు శరణు అంటూ భక్తజనం శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామిని వేడుకుంటూ పూజలు నిర్వహించారు. పండితాపురం గ్రామ శివారులో వేంచేసిన శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర ఉత్సవాల్లో మొదటి రోజైన మంగళవారం జాతర ఉత్సవాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామస్తులు స్వామివారిని ఎండ్ల బండిపై మేళతాళాలతో ఆలయానికి తీసుకురాగా.. ఆలయ పూజారి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అదేవిధంగా సాయంత్రం నిర్వహించిన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలను పూజారి గణపతిబొట్ల మధుసూదన్‌శర్మ ఆధ్వర్యాన చేపట్టారు. నేడు(బుధవారం) సీనియర్ అడ్వకేట్ బోడేపూడి విఠల్‌రావు ఆధ్వర్యాన మహా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్దినేని రమేశ్‌బాబు, బోడేపూడి విఠల్‌రావు, బానోత్ నర్సింహానాయక్, మేకపోతుల మహేశ్‌గౌడ్, గింజల నర్సింహారెడ్డి, చల్ల మల్లయ్య, నల్లమోతు లక్ష్మయ్య, దేవండ్ల రామకృష్ణ, మేకల మల్లిఖార్జున్‌రావు, దొడ్డ వేణు, శ్రీనివాస్, నరేష్, బత్తుల వీరబాబు, గుంటుపల్లి వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

'రాయల'కు సత్కారం



ఖమ్మం సహకారనగర్: నాగేశ్వరరావును సన్మానిస్తున్న ప్రసాద్, నరేందర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/కూసుమంచి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన రాయల నాగేశ్వరరావును ఖమ్మం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన పలువురు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలో న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్, శ్రీమంతా గ్రూప్స్ చైర్మన్ పుసులూరి నరేందర్‌లతో పాటు నేలకొండపల్లి, కూసుమంచి మండలాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, దొనకొండ రామకృష్ణ, చిలకల భూషయ్య, యడవల్లి నాగరాజు, ఎండీ హఫీజుద్దీన్, ఎడవెల్లి రాంరెడ్డి, నాగిరెడ్డి రమేష్‌రెడ్డి, తాళ్లూరి కోటేశ్వరరావు, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులను గుర్తించాలి..

ఖమ్మంరూరల్: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యత ఇవ్వకుండా అన్యాయం చేసిందని మున్నూరు కాపు సంఘం పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో 24 శాతం జనాభా ఉన్న మున్నూరు కాపులను కాంగ్రెస్ గుర్తించకపోవడం దారుణమని చెప్పారు.

రైతులకు శిక్షణ



వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటాయపాలెం రైతువేదికలో మంగళవారం 'రైతునేస్తం'పేరిట శిక్షణ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ విజయనిర్మల, ఏడీఏ సరితతో పాటు ఏఓలు భాస్కర్‌రావు, కిశోర్ బాబు, తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు..

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన భూక్యా రమేశ్ గ్రామంలో పలువురి పేర్ల మీద ఉపాధి పనులు చేశాడు. కాగా, అతడికి సదరు వ్యక్తులు రోజుకు రూ.150 ఇచ్చే విధంగా ఒప్పుకున్నారు. అందులో ఒకరు డబ్బులు ఇవ్వగా.. మరొకరు ఇవ్వకుండా నిరాకరించడంతో రమేశ్ ఆ వ్యక్తి ఇంటి వద్ద రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు తనకు డబ్బులు ఇవ్వాలని ఆందోళనకు దిగాడు. అర్ధరాత్రి సమయాన డయల్ 100కు ఫోన్ చేసి తమకు సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఫోన్‌లోనే బాధితుడిని ఒప్పించారు. గ్రామస్తులతో మాట్లాడించి ఆందోళన విరమింపచేశారు. అధికారుల పర్యవేక్షణ వలన ఒకరికి బదులు మరొకరు పని చేయడంతో లక్ష్యం నీరుగారుతుందని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. రమేశ్ పని చేయలేదని పేర్కొన్నారు



ఆందోళన చేస్తున్న బాధితుడు రమేశ్

అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా

నేడు కామేపల్లి సంఘం కార్యాలయంలో సమావేశం

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) తాత్కాలిక చైర్మన్ కాట్రాల రోశయ్యపై డైరెక్టర్లు ఇచ్చిన నోటీసులకు గాను స్థానిక సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు డీసీఓ అధ్యక్షతన జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. డీసీఓను పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల కోసం నియమించడంతో సమావేశానికి రాలేకపోయాడని, దీంతో సమావేశాన్ని బుధవారం ఎన్నికల అధికారి రవికుమార్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈఓ గాదె నాగయ్య తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన సొసైటీ చైర్మన్..

అవిశ్వాస సమావేశం నిర్వహించే సమయానికి సమావేశాన్ని వాయిదా వేసినట్లు సర్క్యులర్ ఇవ్వడంపై ఖమ్మం కలెక్టర్ గౌతమ్‌ను కామేపల్లి సొసైటీ తాత్కాలిక చైర్మన్ కాట్రాల రోశయ్య కలిశారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తనపై అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు సమాచారాన్ని అందించారని, సమావేశం నిర్వహించే గంట ముందు సమావేశాన్ని వాయిదా వేసినట్లు సర్క్యులర్ జారీ చేశారని, నిబంధనలకు వ్యతిరేకంగా సర్క్యులర్ ఇచ్చినందుకు తనకు మరో 30 రోజుల సమయం కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్లు..

కామేపల్లి: బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కామేపల్లి సొసైటీ డైరెక్టర్లు మంగళవారం ఖమ్మంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యాన గోవింద్రాల, గరిడేపల్లి గ్రామానికి చెందిన పింగళి నాగభూషణం, భట్టు పెంట్యా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల వీరభద్రం, గుజ్జర్లపూడి రాంబాబు, ఏపూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

నేలకొండపల్లి: ఎన్నికల నిబంధనలు వ్యాపారులు కచ్చితంగా పాటించాల్సిందేనని ఎస్సై తోట నాగరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివిధ వ్యాపారుస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ దుకాణంలో జరిగే లావాదేవీలపై అప్రమతంగా ఉండాలని, ఆన్‌లైన్ బదిలీల విషయంలో లీగల్‌గా ఉండాలని, లేనిపక్షంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లేనని పేర్కొన్నారు. రూ.50 వేల దాటితో అందుకు సంబంధించిన బిల్లులను నోడల్ ఆఫీసర్లు తెలియజేయాలని సూచించారు. బ్యాంక్‌లకు వెళ్లే సమయాన డిపాజిట్లు చేసే సమయాన ఆధారాలు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రతీ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా అనుమానితంగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్సై కోడేత్రాచు, వ్యాపార సంఘాల ప్రతినిధులు దోసపాటి శేఖర్, ఆర్.హనుమంతరావు, మాటూరి సుబ్రహ్మణ్యం, వల్లాల రాధాకృష్ణ, గూడవల్లి బ్రహ్మం, చవళం ప్రవీణ్‌కుమార్, చిన్ని నాగభద్రయ్య, ఖమ్మం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

ఫాసిస్ట్ విధానాలను అవలంబిస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంరూరల్: దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళపై దాడులు, ఆగడాలు జరుగుతున్నా.. వారిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మనువాదాన్ని, మతోన్మాదాన్ని మరింతగా బలోపేతం చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. మణిపూర్‌లో రెండు జాతుల మధ్య చిచ్చు రగిల్చి మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం దారుణమని, అమానుషంగా అమానవీయంగా మహిలలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా.. మోదీ పట్టించుకోకుండా పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ఈ సమావేశంలో టి.ఝాన్సీలక్ష్మి, బందెల లలిత, ఆవుల మంగతాయి, పి.శోభ, వసంత తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మతోన్మాదాన్ని నిలువరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించిన మేకల సంగయ్య అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి కార్మిక వర్గ పక్షపాతిగా నిలిచారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకుడు సంగయ్య 8వ వర్ధంతిని పురస్కరించుకొనిమంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మారిన రాజకీయ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీకి అంకితమై సంగయ్య తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఆశయ సాధన కోసం పనిచేయడమే ఆయనకిచ్చే సరైన నివాళి అన్నారు. అలాగే, దేశంలో మతోన్మాదం భయపెడుతుందని, మెజార్టీ మతంలో ఉన్మాదం రగిలితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం వైపు మరింత మందిని ఆకర్షించడం ద్వారా ఉన్మాదాన్ని నిలువరించాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ, పైనంపల్లి, రాజారం, సోలిపురం, కాకరవాయి, సుద్దవాగుతండా, మంగళిబండతండా పోలింగ్ బూత్‌లను మంగళవారం మండల తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలు, ఓటింగ్ సందర్భంగా తలెత్తే ఇబ్బందులపై ఆరా తీశారు. పోలింగ్ బూత్‌లలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సోలీపురం పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ